# ఇద్దరు

ప్రసాద్ సివిల్స్ పరీక్షలు వ్రాసి ఐ.ఆర్.యస్. కేడర్‌కి సెలెక్ట్ అయినాడని విని, మొదట ఆశ్చర్యపోయినా, తర్వాత ఆనందపడ్డాను.

ప్రసాద్‌దీ నాదీ ఒకే వూరు. ఒంగోలు దగ్గర చిన్న కుగ్రామం మాది. పూరిపాకలో పెట్టిన ఎలిమెంటరీ స్కూల్లోనే మేమిద్దరం ఐదో తరగతి వరకూ చదువుకున్నాం.

హైస్కూలు చదువుకోసం ఇద్దరం మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్ళేవాళ్ళం. సైకిలు కూడా కొనలేని బీద కుటుంబాలు మావి. మా నాన్న రైతు కూలి. వాళ్ళ నాన్న టైలర్.

పదో తరగతి పరీక్షల్లో ప్రసాద్ తప్పాడు. నేను శర్మా కాలేజీలో చేరాను. ఆ కబురు విన్న వాళ్ళ నాన్న ఎంతగా బాధపడ్డాడో నాకు ఇప్పటికీ గుర్తుంది.

ప్రసాద్ చలాకీగా ఉండటం నేనెప్పుడూ చూడలేదు. చిన్నప్పటి నుండీ అతను మన్నుతిన్న పాములా మెతగ్గా – బుద్ధిమాంద్యం ఉన్న కుర్రవాడిలానే ఉండేవాడు. తోటి విద్యార్థులకు అతన్ని ఏడ్పించటం సరదా. బైటికి పొడుచుకు వచ్చినట్లు కన్పించే కనుగుడ్లు – చింపిరి జుట్టు, లూజుగా వేలాడే నిక్కరు – వీటన్నిటికి తోడు అమాయమైన చూపు – వెరసి మా వూరిలోని పిల్లాజెల్లా అందరికీ అతనో ఆటవస్తువు.

అతని తండ్రి బట్టలు కుట్టటంలో ఎంత నిష్ణాతుడో – కలలు కనటంలో కూడా అంతే పనిమంతుడని వూరి జనం అనుకునేవారు. తన దగ్గరకు బట్టలు కుట్టించుకోడానికి వచ్చే వాళ్ళకే కాకుండా దారినపోయే దానయ్యల్ని కూడా పిలిచి చెప్పేవాడు తన కొడుకు కలెక్టర్ అవుతాడని. "చూస్తూ ఉండండ్రా – మన ప్రకాశం జిల్లాకు నా కొడుకు కలెకటేర్రై వస్తాడు. అప్పుడు నేను ఈ బట్టలు కుట్టటం మానేసి – దర్జాగా కాలు మీద కాలేసుకుని

– లంక పొగాకు చుట్ట కాలుస్తూ హాయిగా బతికేస్తాను" అనేవాడు. పక్కనే ఉన్న ప్రసాద్‌ని "ఏరా, నా కోరిక తీరుస్తావుగా – నా ఆశలన్నీ ఒక్కగానొక్క కొడుకైన నీమీదే ఉన్నాయన్న విషయం మరిసిపోకు. నువ్వు కలెకటేరు కాలేదనుకో – నేను వురేసుకుని ఛస్తాను" అనేవాడు.

అలా అతనన్న ప్రతిసారీ ప్రసాద్ భరోసా ఇస్తూ, "నువ్వు నిశ్చింతగా ఉండు నాన్నా – నేను తప్పకుండా నీ కోరిక తీరుస్తాను" అనేవాడు. తండ్రిగా తన కొడుకు తెలివితేటల విషయంలో అతను గుడ్డిగా ఉన్నా, వూరి జనాలైతే వూర్కోరుగా. "కాబోయే కలెకటేరు – వెర్రి వెంగళాయి, మన ప్రకాశం జిల్లా పోతురాజు కాలువ పాలోయి" అని రాగయుక్తంగా పాడి ఏడ్పించేవారు.

నేను ప్రసాద్ కోసం వాళ్ళింటికి వెళ్లినపుడల్లా వాళ్ళ నాన్న నన్ను పక్కన కూచోపెట్టుకుని "ఏరా రమణా! నా కొడుకు కలెకటేర్ అవుతాడు కదా" అని అడిగేవాడు. బొటాబొటి మార్కులు వస్తున్న విషయం అతనికి చెప్తే బాధపడ్తాడని "తప్పకుండా అవుతాడు బాబాయ్!" అనేవాణ్ణి. ప్రసాద్ కూడా అమాయకంగా ఆ మాటలు నమ్మేవాడు. "నాకున్న నిజమైన స్నేహితుడివి నువ్వొక్కడివే రమణా! ఎప్పుడూ క్లాసులో ఫస్టుండే నువ్వలా అన్నావంటే నేను తప్పకుండా మా నాన్న కోరిక తీరుస్తానన్న నమ్మకం కలుగుతోంది" అనేవాడు.

ప్రసాద్ పదో తరగతి తప్పినపుడు వాళ్ళ నాన్న పసిపిల్లాడిలా వలవలా ఏడ్చాడు. "నా కొడుకు ఇంక ఎప్పటికీ కలెకటేరు కాలేడా?" అంటూ నన్ను పట్టుకుని భోరుమన్నాడు. సివిల్స్ పరీక్షలు రాయడానికి ఇదేమీ అవరోధం కాదనీ, డిగ్రీ థర్డ్‌క్లాసులో పాసైనా ఫర్వాలేదనీ చెప్పాను. "అలా అయితే వాడు ఎన్ని పరీక్షలు తప్పినా పర్లేదు – నేను బాధపడను. నాక్కావల్సింది వాడు కలెకటేరు కావడమే రమణా!" అన్నాడు.

నేను సైన్స్ సబ్జెక్ట్ తీసుకుని పి.జి. చదువుకోసం వాల్తేర్ వెళ్ళాను. ప్రసాద్ శ్రద్ధగా చదివి, మరలా ఎక్కడా ఫెయిల్ కాకుండా బి.ఎ. సెకండ్ క్లాస్లో పాసైనాడు. నేను ఫైనలియర్‌లో ఉన్నప్పుడు అతను మా యూనివర్సిటీలో బి.యల్.లో చేరాడు. తరచూ నా రూంకొచ్చి కూచునేవాడు. సివిల్స్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో నన్నడిగి తెల్సుకునేవాడు.

ఓ రోజు క్యాంటీన్లో కన్పించాడు. "ఈ సంవత్సరం సివిల్స్ రాయాలనుకుంటున్నా రమణా" అన్నాడు. వాళ్ళ నాన్ననయితే భ్రమల్లో పెట్టగలను కానీ, నా స్నేహితుణ్ణి తప్పుదోవ పట్టించలేను కదా – "నువ్వు లా చదువుతున్నావు కదా, ప్రస్తుతం లా మినిస్టరెవరో చెప్పు" అన్నాను. తెలియదన్నాడు. కాశ్మీర్ సమస్య గురించి నాలుగు వాక్యాలు చెప్పమన్నాను. చెప్పలేకపోయాడు.

"ఈ సంవత్సరం వద్దు. బాగా ప్రిపేర్ అయి వచ్చే సంవత్సరం రాయి. రోజూ పేపర్ చదువు. జనరల్ నాలెడ్జ్ ఇంప్రూవ్ చేసుకో. ప్రతి దాన్నీ అనలిటికల్‌గా చదువు" అన్నాను.

ప్రసాద్ ఉదాసీనంగా మారిపోయాడు. "నువ్వడిగిన రెండు ప్రశ్నలకు సమాధానం తెలియనంత మాత్రాన సివిల్స్ రాయడానికి నేను పనికిరాకుండా పోతానా? నన్ను ఎంకరేజ్ చేయాల్సింది పోయి ఇలా మాట్లాడటం న్యాయమా?" అన్నాడు. అతని కళ్ళలో సన్నటి నీటి పొర . . .

నాక్కూడా అతని వాదనలో నిజముందనిపించింది. మెయిన్స్ బాగా రాస్తే ఇంటర్వ్యూలో మార్కులు తక్కువొచ్చినా సెలెక్ట్ కావచ్చు.

నేను సివిల్స్ కోసం ప్రయత్నించి విఫలమై స్టాఫ్ సెలక్షన్ కమీషన్ పరీక్షలు రాసి ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా జాయినయ్యాను. ఉద్యోగార్థం హైదరాబాద్ వచ్చేసినా, ఇంటినుండి వచ్చే ఉత్తరాల వల్లా, స్నేహితులవల్లా ప్రసాద్‌కు సంబంధించిన సమాచారం తెలుస్తూనే ఉంది.

అతనా సంవత్సరం సివిల్స్ పరీక్షలు రాయకుండా కోచింగ్‌లో చేరాడు. రోజుకు పద్దెనిమిది గంటలు చదువుతున్నాడనీ, సెలవులకు ఇంటికి కూడా రాకుండా దీక్షగా కష్టపడ్తున్నాడని తెలిసి సంతోషపడ్డాను.

ప్రసాద్ ప్రిలిమ్స్ పాసైనాడని ఒకసారీ, మెయిన్స్ పాసైనాడని మరోసారి కబురందింది. మరో ఆర్నెల్లకు ఇంటి నుంచి ఉత్తరం వచ్చింది. దాన్నిండా ప్రసాద్‌కి సంబంధించిన విషయాలే – అతని పట్టుదలని పొగుడ్తూ – వాళ్ళ నాన్న అదృష్టాన్ని మెచ్చుకుంటూ – ప్రసాద్ ఐ.ఆర్.యస్. కేడర్‌కి సెలక్టయినాడంట. ట్రయినింగ్‌కి ముస్సోరీ వెళ్ళాడనీ, అట్నుంచి ఇన్‌కంటాక్స్ ట్రయినింగ్ కోసం నాగపూర్ వెళ్ళాడనీ సారాంశం. ఈ కబురు అతనే రాసి ఉంటే మరీ సంతోషించి ఉండేవాడిని. అతన్ని, అతని ప్రతిభని తక్కువ

అంచనావేశానన్న కోపం అతనికి ఉండి ఉండొచ్చు. ఏదిఏమైనా నా స్నేహితుడు మొట్టమొదటి ప్రయత్నంలోనే సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించడం, అసిస్టెంట్ కమీషనర్‌గా ఉద్యోగం పొందటం నాకు చాలా ఆనందాన్ని కల్గించింది.

దీపావళి పండుగ నాలుగు రోజులుందనగా, భార్యతో కలిసి మా పల్లెటూరు వెళ్ళాను. వూర్లో ఎవరి నోట విన్నా ప్రసాద్ గురించిన మాటలే – ఎవర్ని కదిలించినా అతని కొచ్చిన పెద్ద ఉద్యోగం గురించి కథలే – ప్రసాద్ వాళ్ళ నాన్నకు శుభాకాంక్షలు తెల్పుదామని వెళ్ళాను. అతను నాకు చిన్నప్పటినుండీ తెల్సిన వ్యక్తిలా లేడు. చాలా కొత్త వ్యక్తి – నేనెప్పుడూ ఎరుగని వ్యక్తి – అతని మొహం వింత కాంతితో వెలిగిపోతోంది. కళ్ళల్లో మెరుస్తూ సంతోషం . . .

"చూశావా రమణా – నా కొడుకు నా కోరిక తీర్చాడు. ఇక నాకే దిగులూ లేదు" అన్నాడు.

"మన వూరిలో అంత పెద్ద ఉద్యోగం సంపాయించుకున్న మొదటి వ్యక్తి మన ప్రసాద్. అతను మన వూరికే గర్వకారణం బాబాయ్ – ఇదంతా నీ గొప్పతనమే" అన్నాను.

"ఆ నాదేముంది. వాడు కష్టపడి చదివాడు – పాసైనాడు" అతను మురిసిపోతూ చెప్పాడు.

భాగ్యనగరానికి తిరిగి వచ్చిన పదినెల్లకు ఓ రోజు ఉదయం ఆఫీసుకు లేటయిపోయిందని హడావిడి పడిపోతూ శ్రీమతి వడ్డించిన భోజనం గబగబా తినేస్తూ , కాలింగ్‌బెల్ మోగితే వెళ్ళి చూద్దునుకదా – అదో రకంగా నవ్వుతూ ప్రసాద్.

అసిస్టెంట్ కమీషనర్‌గా హైదరాబాద్‌కే పోస్టింగ్ వచ్చిందట. జాయిన్ కావడానికి మరో వారం రోజుల టైం ఉందట. హోటల్లో సామాన్లు పడేసి మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడట. ఈ లోపల మంచి యిల్లు చూసి పెట్టమని అడిగాడు.

'సివిల్స్ రాయడానికి నువ్వే నాకు సలహాలు ఇచ్చేవాడివి. ఇప్పుడు నువ్వు ఇన్‌స్పెక్టర్‌వి. నేను అసిస్టెంట్ కమీషనర్‌ని – అంటే నీ బాస్ని – నువ్వు రోజూ నాకు నమస్కారం కొట్టాలి. కాకా పట్టాలి" మరలా అదోలా నవ్వుతూ అన్నాడతను. ఆ నవ్వు తోడేలు నవ్వులా వికృతంగా ఉంది.

అతనన్న మాటలకు నా శ్రీమతి నొచ్చుకుంది. "చిన్ననాటి మిత్రుడు కదా ఏదో

సరదాగా అని ఉంటాడు తప్ప మనల్ని కించపర్చాలన్న ఉద్దేశం డెఫినెట్‌గా ఉండి ఉండదు" అంటూ నేనే సర్ది చెప్పాను.

ఆ రోజు ఆఫీసుకు సెలవు పడేసి అద్దె ఇళ్ళ కోసం వూరిమీద పడ్డాం. మాంచి సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ ఖరారు చేసుకుని, ఓనర్ రెండునెలల అడ్వాన్స్ అడిగినపుడు ఇచ్చేయమన్నట్టు ప్రసాద్ వైపు చూశాను. "నువ్విచ్చెయ్ - జీతం తీసుకోగానే నీ బాకీ తీర్చేస్తాను" అన్నాడు.

ఓనర్‌తో సాయంత్రం లోపల డబ్బు కట్టేస్తానని చెప్పి లాడ్జిలో పడున్న సామాన్లు కొత్తింటికి చేరవేశాం. ఆ రాత్రి భోజనం మా ఇంట్లో ఏర్పాటు చేసి మాటల సందర్భంలో "నీ విజయ రహస్యం ఏమిటో చెప్పు" అని నవ్వుతూ అడిగాను.

"సింపుల్ ! ఆప్షనల్స్ కోసం కోచింగ్ తీసుకున్నాను. రోజుకు పద్దెనిమిది గంటలు కష్టపడి చదివాను. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏముంటుంది?"

నిజమేననిపించింది. ఎటొచ్చీ నాకర్థంకాని విషయం ఒకటుంది. ప్రసాద్ ఇంగ్లీషులో చిన్న వాక్యం కూడా మాట్లాడలేడు. మరి ఇంటర్వ్యూలో ఎలా నెగ్గుకొచ్చాడా అని. సూటిగా అడగలేక "ఇంటర్వ్యూ ఎలా జరిగింది?" అని అడిగాను.

ప్రసాద్ నా వైపు దీర్ఘంగా చూసి తమాషాగా నవ్వాడు. "నీ అనుమానం నాకర్థమైందిలే - నేను ఆప్షనల్స్ తెలుగులో రాశాను. ఇంటర్వ్యూ కూడా తెలుగులోనే చేసాను. ఇంతేనా, లేక ఇంకేమైనా అనుమానాలు ఉన్నాయా? దాచుకోకుండా ఇప్పుడే అడిగేయ్" అన్నాడు.

నేను ఇబ్బందిగా నవ్వి వూరుకున్నాను.

ప్రసాద్ కోరిక మీద నాకు తెల్సిన ఫర్నీచర్ షాపులో ఓ మంచం, రెండు కుర్చీలు, టీపాయ్, మంచం మీదికి పరుపూ, దిండ్లూ ఇప్పించాను. డబ్బులు నెలాఖరుకి ఇచ్చేలా నేను హామీ ఇచ్చాను.

నా ఆఫీసు తిలక్‌రోడ్డులోని చర్చ్ బిల్డింగ్‌లో. ప్రసాద్ పనిచేసేది బషీర్‌బాగ్‌లోని ఆయకర్ భవన్‌లో. అందువల్ల అతన్ని ఆఫీసులో కలిసే అవకాశం చాలా తక్కువ. అందునా నాది ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం కావటం వల్ల ఎక్కువగా ఔట్‌డోర్ డ్యూటీలతో బిజీగా ఉంటాను. అందుకే సాయంకాలాలు ఎప్పుడైనా వెళ్ళి పల్కరించి వస్తున్నాను.

అతను కోటూ, టై లేకుండా బైటికి కదిలేవాడు కాదు. నల్లగా నిగనిగలాడే బూట్లు,

నూనెరాసి నున్నగా దువ్విన తల, మడత నలగని బట్టలు, సఫారీ సూట్లూ . . . నాకు తెల్సిన ప్రసాద్‌కీ, ఇతనికీ హస్తి మశకాంతరం.

"ఈ రెండు కోట్లు నీ జీతంతో కుట్టించుకుని ఉంటావ్ అవునా?" అని అడిగానోసారి.

"కాదు. ఆఫీసుకు మొదటి రోజు తను కుట్టించిన కోటు వేసుకునే పోవాలని మా నాన్న ఈ రెండు కోట్లు కొని, శ్రద్ధగా కుట్టిచ్చాడు".

నల్లగా ముఖమల్‌లా మెరుస్తున్న కోటులో వాళ్ళ నాన్న వాత్సల్యంతో పాటు అతని దుర్భరమైన పేదరికం కూడా కన్పించింది. ఎంత అభిమానమో! తన కొడుకు పెద్ద ఉద్యోగస్థుడైనా అతని జీతంలోంచి పైసా తీసుకోకుండా తన స్వేదంతో తడిసిన డబ్బుల్తో కొడుక్కి కోట్లు కుట్టించాడు. ఏమైనా ఇక అతను డబ్బుకి తడుముకోవాల్సిన పనిలేదు.

ఓ రోజు ప్రసాద్ కోసం అతని ఫ్లాట్‌కి వెళ్ళాను. అక్కడ అతన్తో మాట్లాడ్తూ ఇద్దరు కొత్త వ్యక్తులున్నారు. వాళ్లకు యాభైకి పైగా వయసుంటుంది. పరస్పర పరిచయాల తర్వాత తెల్సింది - అందులో ఒకతను ఎమ్మార్వో. మరొకతను అతని స్నేహితుడు. ఎమ్మార్వోగారి అమ్మాయి కంప్యూటర్ ఇంజనీర్ చదివింది. సంబంధం మాట్లాడటాని కొచ్చారు. వాళ్ళను సాగనంపటానికి బైటి వరకూ వెళ్ళినపుడు ప్రసాద్ చాలా బుద్ధిమంతుడనీ, ఏ రకమైన చెడు అలవాట్లు లేవనీ, వాళ్ళమ్మాయి సుఖ పడ్తుందనీ చెప్పాను. "ఈ సంబంధం కుదిరితే మా అమ్మాయి అదృష్టవంతురాలే - నువ్వూ చెప్పిచూడు బాబు" నా చేతులు పట్టుకుంటూ అన్నాడతను.

ఒంగోల్లో ఉన్న బంధువుల ద్వారా ప్రసాద్ గురించి విని వచ్చారట. ఆ విధంగానే ప్రసాద్‌కి మరో సంబంధం కూడా వచ్చింది. అతను ఒంగోల్లో బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అమ్మాయి కూడా ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఈ మధ్యనే సెలక్ట్ అయిందట.

పెళ్ళికూతురు సెలక్షన్‌లో తలమునకలుగా ఉన్న ప్రసాద్, ఓ రోజు హడావిడిగా మా ఇంటికొచ్చి కలర్ టీవీ, ఎల్జీ ఫ్రిజ్ కావాలని టెండర్ పెట్టాడు.

"నీకు నా కన్నా మూడింతల జీతం వస్తుంది - కొనేసుకోవచ్చుగా" అన్నాను.

"నిజమే - కానీ మా ఇంటి పరిస్థితి నీకు తెల్సుగా. నా కోసం మా నాన్న చేసిన అప్పులు తీర్చటం నా మొదటి బాధ్యతగా ఎక్కువ మొత్తం మా ఇంటికి పంపిస్తున్నాను. నువ్వు అప్పుగా ఇప్పించు. నేను నెలనెలా కొంత ఇస్తాను" అన్నాడు.

అతను చెప్పింది సబబేననిపించింది.

నేనా ప్రయత్నాల్లో ఉండగా మా ఆఫీసర్‌గారి దగ్గరకు కొత్తగా సెలక్టయిన అసిస్టెంట్ కమీషనర్ శ్రీకర్ వచ్చారు. మాటల సందర్భంలో  నా మిత్రుడు ప్రసాద్ కూడా వాళ్ళ బ్యాచేనని, ఆయకర్ భవన్‌లో పని చేస్తున్నాడని చెప్పాను.

అతను భృకుటి ముడివేసి నావైపు అదోలా చూశాడు. "ప్రసాదా? అలాంటి పేరుగల వారెవరూ మా బ్యాచ్‌లో లేరే" అన్నాడు.

"అలా అంటారేమిటి సార్? ప్రసాద్ . . . కొద్దిగా నలుపు – పొట్టిగా ఉంటాడు. ఒంగోలు దగ్గర పల్లెటూరు. బహుశా మీకు గుర్తు రావటం లేదేమో?"

"ఓ సంవత్సరకాలం ట్రయినింగ్‌లో కల్సి ఉండిన నా బ్యాచ్ వాళ్ళను నేనెలా మర్చిపోతాను? అబ్‌సర్డ్! మన డిపార్ట్‌మెంట్‌కి ఆంధ్రా నుంచి సెలక్ట్ అయిన వాళ్ళం ముగ్గురమే. అందులో మీ ప్రకాశం జిల్లా నుంచి ఎవ్వరూ లేరు. ప్రసాద్ అనే ఈ మిస్టికల్ శాల్తీ అస్సలు లేడు".

నేను మాట రాక నిలబడిపోయాను.

"సార్! మీరు చెప్పేది నిజమేనా? నేను నమ్మలేకపోతున్నాను సార్! అతను ట్రయినింగ్ కోసం నాగపూర్‌లో పదినెలలు గడిపాడు. ఇప్పుడు పోస్టింగ్ . . ."

అతను సగంలోనే ఆపేసి చెప్పాడు, "మీరు స్నేహితుడంటున్నారు. కానీ అతనెవరో పచ్చి మోసగాడిలా ఉన్నాడు. జాగ్రత్తగా ఉండండి. అసలే క్రిమినల్ కేసు కింది కొస్తుంది".

నాకంతా అయోమయంగా ఉంది. ప్రసాద్ నిజంగానే మోసగాడా? తన తండ్రినీ, స్నేహితుల్ని, తన వూరివాళ్ళనీ అందర్ని మోసం చేశాడా? అతనికొచ్చిన సంబంధాలు గుర్తొచ్చాయి. కట్నం కోసం అభం శుభం తెలీని ఆడపిల్ల జీవితాన్ని నాశనం చేయడానికి కూడా వెనుకాడలేదంటే అతనెంత దుర్మార్గుడో అర్థమౌతోంది. పైకి అమాయకంగా కన్పిస్తూ– గోముఖవ్యాఘ్రం అంటే ఇలాంటి వాళ్ళే . . .

అయినా ప్రసాద్ గురించి అలా ఆలోచించడానికి మనసొప్పటం లేదు. అతను నాకు చిన్నప్పటి నుండీ తెలుసు. మోసం చేసే మనస్తత్వం కాదతనిది. ప్రసాద్‌ని నిలదీసే ముందు ఎందుకైనా మంచిదని చిక్కడపల్లి లైబ్రరీలో కూచుని పాత పేపర్లు తిరిగేశాను.

సివిల్స్ పరీక్షల రిజల్ట్స్ ఉన్న పేపర్ని చాలా జాగ్రత్తగా పరిశీలించాను. ప్రసాద్ పేరు లేదు.

అట్నుంచటే అతని రూంకెళ్ళాను. అతను ఇద్దరు యువకుల్తో మాట్లాడ్తున్నాడు. నన్ను చూసి పల్కరింపుగా నవ్వి, "కూచో – వీళ్ళిద్దరూ సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నారు. నా గైడెన్స్ కోసం వస్తే నాకు తోచిన సలహాలు ఇస్తున్నా" అన్నాడు. వాళ్లకు తను తీసుకున్న ఆప్షనల్స్, వాటిని ఎంచుకోవటం వల్ల లాభాలు, తనెలా టైంని మేనేజ్ చేసుకున్నాడూ, ఇంటర్వ్యూ ఎలా చేశాడూ వివరంగా చెప్పాడు.

"అసలు నాకు ఐ.ఏ.యస్సే. రావాల్సింది. కొద్దిలో తప్పిపోయింది" అన్నాడు ముక్తాయింపుగా.

నాకొస్తున్న కోపాన్ని అదుపు చేసుకోవటం కష్టంగా ఉంది. వాళ్ళిద్దరూ వెళ్ళేవరకూ ప్రాణం ఉగ్గబట్టుకుని కూచున్నాను. వాళ్ళు వెళ్ళాక రెండుమూడు నిమిషాలు మౌనంగా కూచున్నాను. ఏమడగాలో, ఎలా అడగాలో, కోప్పడాలో, తిట్టాలో, జాలిపడాలో, బాధపడాలో అర్థం కాకుండా ఉంది.

"ఏమిటదోలా ఉన్నావు?" వచ్చి నా పక్కన కూచుంటూ అడిగాడు.

నేనతని కళ్ళలోకి సూటిగా చూస్తూ "ఎందుకు ఇంతమందిని మోసం చేశావు? ఉద్యోగం వచ్చిందని ఎందుకు అబద్ధం చెప్పావు?" అని అడిగాను.

అతను ఉదాసీనంగా మారిపోయాడు.

"ముసలితనంలో ఉన్న నీ తండ్రిని మోసం చేయడానికి నీకు మనసెలా ఒప్పింది?" నా కంఠంలో కోపం లేదు. సుళ్ళు తిరుగుతూ అనంతమైన బాధ . . . అతను మౌనంగా రోదిస్తున్నాడు.

"పెళ్ళి సంబంధాలు కూడా చూశావే – నువ్వు ఛీట్ చేస్తున్నావని ఎవరైనా పోలీసులకి రిపోర్ట్ ఇస్తే నీ బతుకు ఏమయ్యేది?"

ప్రసాద్ సన్నగా వణకటం నాకు తెలుస్తోంది.

నా రెండు చేతులు పట్టుకుని, "రమణా! నువ్వే నన్ను రక్షించాలి. ఈ విషయం ఎవ్వరికీ చెప్పవు కదూ" అన్నాడు.

"సరే – జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావు?"

“కొద్దిగా డబ్బులు సర్దు - నేను మద్రాసెళ్ళిపోతాను. నాకు ట్రాన్స్‌ఫరైందని చెప్పుకుంటాను”.

అతని జవాబు విని ఆశ్చర్యం వేసింది. “అంటే ఇప్పటివరకూ ఆడిన నాటకాన్ని కొనసాగించే ఉద్దేశమే తప్ప ముగింపు చేయనంటావ్” అన్నాను తీవ్రంగా.

“రమణా! నన్ను ఇరకాటంలో పెట్టకు. మన వూరివాళ్ళకు నిజం తెలిస్తే నేనేమైపోతాను? నాన్నకు తెలిస్తే ఆయనేమైపోతారు?”

“అలాగని అప్పులు చేసుకుంటూ జీవితాన్ని నాశనం చేసుకుంటావా? ఇలాంటి విషయాలు ఎప్పుడో ఒకప్పుడు తెలియక మానవు. అప్పటికి నువ్వు నిండా కూరుకుని పోతావు. ఆ వూబిలోంచి బైటికి లాగటం అసాధ్యమైపోతుంది. మారు మాట్లాడకుండా మనవూరు వెళ్ళిపో”.

అతనేమనుకున్నాడో ఏమో, “సరే, నాక్కొద్దిగా డబ్బులివ్వు. మన వూరెళ్ళిపోతాను” అన్నాడు

అతనంత సునాయాసంగా ఒప్పుకోవటంతో చాలా అనుమానాలు వచ్చాయి. నాకలా చెప్పి మద్రాసెళ్ళడని గ్యారంటీ ఏమిటి? మా వూరెళ్తాడనీ, అందరి దగ్గరా నిజం చెప్తాడనీ నమ్మకం ఏమిటి? నాకు తెల్సినవాళ్ళ దగ్గర అప్పుచేసి, అతని అద్దె బకాయి చెల్లించి అతన్తోపాటే నేనూ మా వూరు బయల్దేరాను.

“నాన్నకు చెప్పకు - తట్టుకోలేడు” అన్నాడు.

“తెలియాల్సిందే అతనికి - నీ కోసమని ఉన్న పొలం కాస్తా అమ్ముకున్నాడు. ఇప్పటికి ఎన్ని అప్పులు చేశాడో? నువ్వేమో బి.యల్.పూర్తి చేయకుండా సగంలో వదిలేసి వచ్చావు. జీవితాన్ని దేనికీ కొరకాకుండా చేసుకున్నావు కదా”.

అలా అన్నానే కానీ నాకూ భయంగానే ఉంది. పెద్ద హోదా గల ఉద్యోగం మాట దేవుడెరుగు తన కొడుక్కి చిన్నపాటి ఉద్యోగం కూడా లేదని తెలిస్తే గుండె పగిలి చస్తాడేమో? అలాగని నిజం దాచి ఎంతకాలం అతన్ని క్షోభ పెట్టాలి?

ఈ సందిగ్ధంలోనే ఊరు చేరుకున్నాం. నేరుగా ప్రసాద్ వాళ్ళింటికే వెళ్ళాం.

బైట చాలామంది గుమికూడి ఉన్నారు. మమ్మల్ని చూడగానే, “అదుగో ప్రసాద్. కబురంది ఉంటుంది. వెంటనే బయల్దేరినట్లున్నారు” అన్నారెవరో.

లోపలికెళ్ళాక మాకు విషయం అర్థమైంది. ప్రసాద్ వాళ్ళ నాన్నకు అంతిమ క్షణాలు . . .

ప్రసాద్‌ని చూడగానే అతని కళ్ళు మెరిశాయి. "మావాడొచ్చేశాడు – మా వాడు పెద్ద ఆఫీసర్ – నా కొడుకు పెద్ద ఆఫీసర్. . . " అంటూ తుదిశ్వాస విడిచాడు.

*****

పని వత్తిడి వల్ల మరో ఆర్నెల్లవరకూ మా వూరెళ్ళటం కుదరలేదు. మే నెల చివర్లో ఓ వారం సెలవు పెట్టి మా ఊరెళ్ళాను. అమ్మానాన్నల్ని పలకరించాక ప్రసాద్ ఇంటికి బయల్దేరాను.

నేను వెళ్ళేప్పటికి ఇంటి లోపల ఎవర్నో కూచోబెట్టుకుని పెద్దగా మాట్లాడ్తున్నాడు ప్రసాద్.

లోపలికి వెళ్ళాలా వద్దా అనే సంకోచంతో నేను బైటే నిలబడి పోయాను. ఇంటి కిటికీలోంచి ప్రసాద్ నాకు స్పష్టంగా కన్పిస్తున్నాడు. అతనెదురుగా నలుగురు మనుషులు కూచుని ఉన్నారు.

"ఉద్యోగం పెద్దదే – కానీ ఎన్ని వత్తిళ్ళనుకున్నారూ! ఓసారి కోట్లలో వ్యాపారం చేస్తున్న బడా వ్యాపారస్తుణ్ణి పట్టుకున్నా – వెంటనే డజన్లకొద్దీ ఫోన్లు – మినిష్టర్ల దగ్గరనుంచి – దానికి తోడు గూండాల బెదిరింపు వదలకపోతే చంపేస్తామని – నేను నా దేశానికి ద్రోహం చేయలేనని తెగేసి చెప్పాను. అయినా ఈ రోజుల్లో నీతిగా బతకనిస్తారా? నిజాయితీగా ఉద్యోగం చేసుకోనిస్తారా? నాకు రోజుకో ట్రాన్స్‌ఫర్ . . . విసుగై పోయింది . . . మీరూ వద్దూ, మీ ఉద్యోగమూ వద్దని రిజైన్ చేసి వచ్చేశాను".

ప్రసాద్ మొహంలో నిజాయితీ . . . అతని మాటల్లో అంతా నిజమే చెప్తున్నానన్న నమ్మకం. అతను మరో ప్రసాద్.

అతన్ని కలవకుండా నిశ్శబ్దంగా బైటికి నడిచాను.

**(ఆదివారం వార్త - 27 ఏప్రిల్, 2003)**